సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ꠰ 26 ꠰ ఏప్రిల్ ꠰ 2023



శ్రీవారి సేవలో ఎస్పీ

రాపూరు: పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని మంగళవారం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి దర్శించుకున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.62,080
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,545
3 శాతం జీఎస్టీతో	రూ.5,711
సవర (8 గ్రా)	రూ.45,688

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /28.0

మంగళవారం గాలిలో 63 శాతం తేమ ఉంది. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి. అలాగే బుధవారం అక్కడక్కడా జల్లులు పడొచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన కలెక్టర్



వెంకటాచలం: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కలెక్టర్ ఎం.హరి నారాయణన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు, యువత, మహిళల స్వయం ఉపాధి కోసం చేపట్టిన వృత్తి నైపుణ్య కార్యక్రమాలు, పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యసేవల గురించి కలెక్టర్‌కు వెంకయ్యనాయుడు వివరించారు.

న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు



మాట్లాడుతున్న బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(లీగల్): నెల్లూరు కోర్టులో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ముగ్గురు న్యాయమూర్తులకు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. నెల్లూరు 5వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తూ రాజమహేంద్రవరం ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బదిలీపై వెళ్తున్న మాధురి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ చిత్తూరు జిల్లా పీలేరు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వెళ్తున్న శ్రీనివాసులునాయక్, నెల్లూరు రెండో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తూ కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వెళ్తున్న ప్రసూనలను నెల్లూరు బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. తమకు విధి నిర్వహణలో సహకరించిన న్యాయవాదులకు బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖరరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరెడ్డి, అన్వర్‌బాషా, కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మత్స్య కళాశాల డీన్‌కు అవార్డు



రవీంద్రకుమార్‌రెడ్డి

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరులో ఉన్న మత్స్య కళాశాలలో ఫిషరీస్ డీన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డి.రవీంద్రకుమార్‌రెడ్డికి 'బెస్ట్ డీన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు వచ్చింది. అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఇటీవల ఢిల్లీలో 'రీసెర్చ్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్' మరియు 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్' సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ అగ్రికల్చర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ అండ్ సోషల్ సైన్స్' అనే అంశంలో ఆయన అవార్డు అందుకున్నారు. డాక్టర్ రవీంద్రకుమార్‌రెడ్డి చేసిన పరిశోధనలు, అకడమిక్ యాక్టివిటీస్‌లో చేసిన పలు మార్పులకుగానూ అవార్డును ప్రదానం చేశామని ఐఐపీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ సుదీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మత్స్య కళాశాల ప్రొఫెసర్లు, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులు మంగళవారం డీన్‌ను అభినందించారు.

సోమశిలలో 51.564 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 51.564 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 189 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 96.590 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

విద్యా సంవత్సరంలో కొత్త కొత్తగా..

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు దారుణంగా ఉండేవి. వసతులు శూన్యం. విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు అందేవి కాదు. వారు ఇబ్బంది పడుతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నాడు – నేడు పథకాన్ని ప్రవేశపెట్టి వందలాది బడులను బాగు చేశారు. విద్యాకానుక ఇస్తున్నారు. పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకున్నారు.



జిల్లాకు చేరిన తొలివిడత పాఠ్యపుస్తకాలు

- ఈనెలాఖరుకు రెండో విడత రాక
- అందుబాటులో 10 లక్షలకు పైగా పుస్తకాలు
- వచ్చే నెల తొలి వారం నుంచి మండలాలకు సరఫరా

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. మనబడి నాడు – నేడు పథకాన్ని ప్రవేశపెట్టి పాఠశాలలను సుందరీకరించింది. విద్యాకానుక కింద విద్యార్థులకు 9 రకాల వస్తువులు అందజేస్తోంది. మధ్యాహ్న భోజనం పథకం మెనూను సమూలంగా మార్చేసింది. కార్పొరేట్‌కు దీటుగా ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తోంది. ఈ విద్యా సంవత్సరం ముగియక ముందే 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి తొలివిడతలో కొత్త పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. మరో రెండు విడతల్లో పూర్తిస్థాయిలో పుస్తకాలు రానున్నాయి. గత ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ముగుస్తున్నా పుస్తకాలు పూర్తిగా రాక అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.



బుక్ డిపోలో కొత్త పాఠ్యపుస్తకాలు

జిల్లాలో..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు : 3,449	ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య : 2.62 లక్షలు
తొలివిడతలో వచ్చిన పాఠ్యపుస్తకాలు : 7.50 లక్షలు	

జిల్లాలో..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వానికి సంబంధించి 1,961 ప్రాథమిక, 240 ప్రాథమికోన్నత, 316 ఉన్నత, మున్సిపల్‌కు సంబంధించి 60 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 19 ఉన్నత, ఎయిడెడ్‌కు సంబంధించి 19 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో మొత్తం 2.62 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మొత్తం 22 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరమని విద్యాశాఖ అధికారులు ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపించారు.

ఇప్పటి వరకు..

జిల్లాకు తొలివిడతలో 7,52,827 పాఠ్య పుస్తకాలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు పంపించారు. వీటిని నెల్లూరులోని బుక్‌డిపోలో భద్రపరిచారు. గత సంవత్సరం విద్యార్థులకు సరఫరా చేయగా 2.80 లక్షల పుస్తకాలు మిగిలాయి. పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలు ఒకవైపు తెలుగు, మరోవైపు ఇంగ్లిష్ మీడియంలో ముద్రించారు. కాగా 8, 10వ తరగతులకు సంబంధించి అన్ని పుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 70 శాతం పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. 6, 7 తరగతులకు సంబంధించి గత విద్యా సంవత్సరంలో మిగిలినవి కొన్ని ఉన్నాయి. కాగా మే రెండో వారానికల్లా పూర్తిస్థాయిలో పుస్తకాలు రానున్నట్లు చెబుతున్నారు. 9వ తరగతికి సంబంధించి ఈ విద్యా సంవత్సరం కొత్త సిలబస్‌తో పుస్తకాలను సిద్ధం చేస్తున్నారు. అవి కూడా వచ్చేనెల మొదటి వారంలో రానున్నట్లు సమాచారం. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను సరఫరా చేయడం లేదు. ప్రస్తుతం కొత్త, పాత పుస్తకాలు కలిపి మొత్తం 10 లక్షలకు పైగా అందుబాటులో ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

సరఫరా ఇలా..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి పాఠ్య పుస్తకాలను మే మొదటి వారం నుంచి ఆయా మండల విద్యాశాఖ కార్యాలయాలకు పంపించనున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేస్తారు. గతేడాది ఆర్టీసీ బస్సుల ద్వారా పుస్తకాలను సరఫరా చేశారు. ఈ ఏడాది కూడా ఆర్టీసీ ద్వారానే తరలించేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆ శాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తిస్థాయిలో పుస్తకాలను సరఫరా చేయనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వారికి కావాల్సిన అన్ని రకాల వస్తువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో అందజేస్తాం

ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాకు తొలివిడతలో పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వచ్చేనెల తొలివారం నుంచి అన్ని మండల కార్యాలయాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు పుస్తకాలను సరఫరా చేయనున్నాం. విద్యా సంవత్సరం పునః ప్రారంభం వెంటనే విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందజేస్తాం.

– గంగాభవాని, డీఈఓ

ఆ కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మహిళలకు పథకాలను వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్ కోసం భూములు ఇచ్చిన కుటుంబాల్లోని వారికి ఉద్యోగాలు కల్పించామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పైనాపురం పంచాయతీలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జెన్‌కో ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే భూములిచ్చిన కుటుంబాలకు చెందిన 200 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. మరో 17 మందికి ఉద్యోగాలిచ్చే అంశంపై ఎండీతో మాట్లాడామన్నారు. అయితే సెంబ్‌కార్ప్ పవర్ ప్రాజెక్ట్ వల్ల ఉద్యోగ – ఉపాధి అవకాశాలు కల్పించకపోగా ప్రజలకు కాలుష్యం మాత్రమే మిగిలిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ సమస్యలపై పోరాటం చేశామన్నారు. గతంలో చంద్రబాబు ప్రాజెక్టులను బాంబులతో పేల్చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత జెన్‌కో ప్రాజెక్ట్ 2వ దశకు రిబ్బన్ కత్తిరించి, ఇవన్నీ తామే సాధించినట్టు గొప్పలు చెప్పారని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను మాత్రం ఆయన పరిష్కరించలేదన్నారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మండలంలో తెల్లరేషన్‌కార్డులున్న ప్రతి కుటుంబానికి రూ.25 వేలు చొప్పున నాన్ ఫిషర్ మెన్ ప్యాకేజీ అందజేశామన్నారు. ఇందుకోసం రూ.36 కోట్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారన్నారు.

మరో నెలలో గడప గడపకు పూర్తి

సర్వేపల్లి నియోజకవర్గంలో మరో నెలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవుతుందని కాకాణి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంపై మరింత దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, స్థానిక సర్పంచ్ కావలి విజయకుమార్, ఎంపీపాళెం సర్పంచ్ మునుకూరు జనార్దనరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి, స్థానికుడు పట్టపు రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భరోసా

- జగనన్న వసతి దీవెన నిధుల విడుదల నేడు

నెల్లూరు(వేదాయపాళెం): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు అండగా ఉంది. ఉన్నత చదువులు అభ్యసిస్తున్న వారికి ఆర్థికంగా ప్రతి సంవత్సరం భరోసా కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ పిల్లలకు 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత జగనన్న వసతి దీవెన నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అనంతపురం జిల్లాలో జరిగే కార్యక్రమంలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు సంబంధిత కాలేజీల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేలా సహాయ సంక్షేమశాఖాధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ, సాధికారిత అధికారి వై.వెంకటయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 48,282 మంది అర్హులైన విద్యార్థులుండగా, 43,434 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తుంది. ఇందుకోసం రూ.46.98 కోట్లను కేటాయించారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనడంతోపాటు అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన చర్యలను అధికారులు తీసుకున్నారు.

సంక్షేమ శాఖల వారీగా..

సంక్షేమ శాఖ	విద్యార్థుల సంఖ్య	నిధులు
ఎస్సీ	11,549	రూ.11,15,57,500
ఎస్టీ	1,693	రూ.1,62,65,000
బీసీ	18,736	రూ.18,25,02,500
ఈబీసీ	8,521	రూ.8,40,35,000
ముస్లిం మైనార్టీ	4,975	రూ.4,81,50,000
కాపు	2,697	రూ.2,62,27,500
క్రిస్టియన్	111	రూ.10,97,500

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	నిధులు
ఆత్మకూరు	5,494	రూ.5,34,75,000
కందుకూరు	5,792	రూ.5,64,67,500
కావలి	5,746	రూ.5,58,97,500
కోవూరు	5,967	రూ.5,75,35,000
నెల్లూరు నగరం	10,752	రూ.10,50,32,500
నెల్లూరు రూరల్	758	రూ.73,77,500
సర్వేపల్లి	5,329	రూ.5,15,50,000
ఉదయగిరి	5,926	రూ.5,79,57,500
వెంకటగిరి	2,518	రూ.2,45,42,500

(సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలు)

గురుకులాల్లో ప్రవేశానికి 28 వరకు గడువు

నెల్లూరు(వేదాయపాళెం): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల గడువును ఈనెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు గురుకులాల జిల్లా కన్వీనర్ టి.కామేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గండిపాళెం, తుమ్మలపెంట, ఆత్మకూరు, నెల్లూరు మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 97018 89873 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

విలువలతో కూడిన విద్యకు పెద్దపీట



శ్రావణ్, ఆయన తల్లిని సత్కరించిన కిషన్‌రెడ్డి, వెంకయ్యనాయుడు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ప్రపంచాన్ని శాసించే శక్తి భారత్‌కు ఉంది
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వెంకటాచలం: విలువలతో కూడిన విద్యకు పెద్దపీట వేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న అక్షర విద్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన 12వ వార్షిక వేడుకలకు ముఖ్య అతిథిగా వెంకయ్యనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని రేపటి పౌరులకు అందించాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ విలువలతో కూడిన విద్యను అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన అక్షర విద్యాలయం ఆ స్ఫూర్తిని కాపాడుకోవడం అభినందనీయమన్నారు. అక్షరం అంటే మనం నేర్చుకునే మాటలు కాదని, మనల్ని ముందుకు నడిపే విజ్ఞానమని తెలిపారు. దేశ భవిష్యత్ యువత భుజస్కందాల మీద ఉందని, ఉన్నతంగా ఆలోచించి సంస్కృతిలో భాగమైన షేర్ అండ్ కేర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. పశువులు, చెట్లు, నదులను పూజించడంతోపాటుగా వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

3 కి.మీ నడిచి వెళ్లా

విశిష్ట అతిథిగా విచ్చేసిన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తాను చిన్నతనంలో మూడు కిలోమీటర్లు నడిచి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసించానని తెలిపారు. ప్రస్తుతం ఉన్నతమైన ఆలోచనలతో అనేక విద్యాసంస్థలు ఏర్పడడం విద్యార్థులకు మంచి అవకాశమని చెప్పారు. విద్యకు ఉన్న ప్రాధాన్యతను తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. తమ పిల్లలను ఉన్నత చదువుల వైపు మళ్లించి మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందేలా చూడాలన్నారు. ప్రపంచాన్ని శాసించే శక్తి భారత్‌కు ఉందని, యువత మంచి ఆలోచనలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

- వార్షికోత్సవ వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఇండియన్ ఐడల్ టాపర్, ప్రముఖ సింగర్ ఆర్పీ శ్రావణ్, ఆయన తల్లిని కేంద్రమంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి సత్కరించారు. అక్షర విద్యాలయంలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో నగదు బహుమతులను కేంద్రమంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్టీ ఐ.దీపా వెంకట్, వెంకయ్యనాయుడు సతీమణి ముప్పవరపు ఉషమ్మ తదితరులు పాల్గొన్నారు.
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తొలుత వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్నారు. అక్కడ చేపడుతున్న సేవ, మహిళలకు వివిధ కోర్సుల్లో ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను పరిశీలించారు.

1,633 పొగాకు బేళ్ల కొనుగోలు



కలిగిరి: మండలంలోని కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 741 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 775 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 34 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.160, సగటున రూ.194.85 ధర లభించింది. వేలంలో 9 కంపెనీలు పాల్గొన్నాయి.

- ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి మంగళవారం మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన పొగాకు రైతులు 915 బేళ్లు తీసుకురాగా 892 బేళ్లు కొనుగోలు చేశామని వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. 1,16,196 కిలోల పొగాకు అమ్ముడుకాగా రూ.2,30,05,741ల వ్యాపారం జరిగింది. కిలో పొగాకు అత్యధికంగా రూ.200, అత్యల్పంగా రూ.174 ధర పలికింది. వేలంలో పది కంపెనీలు పాల్గొన్నాయి.

ఒకటి నుంచి రెండో పంటకు నీటి విడుదల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో రెండో పంటకు సోమశిల జలాశయం నుంచి నీటిని వచ్చే నెల ఒకటో తేదీ నుంచి విడుదల చేస్తామని ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఏబీ తీర్మానాన్ని అనుసరించి మొత్తం 2.85 లక్షల ఎకరాలకు నీటిని అందించనున్నట్లు తెలియజేశారు. ఆయా మండల కేంద్రాల్లో కాలువల వారీగా నీటి పంపిణీ వివరాలను ప్రకటిస్తామన్నారు. నీరు వృథా చేయకుండా సాగు చేయాలని కోరారు. అత్యవసరంగా ఉన్న 70 ఓఅండ్ఎం వర్క్‌లకు రూ.5 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను రూపొందించామన్నారు. అవసరాల ప్రాతిపదికన పనులను చేపడతామన్నారు.

క్లుప్తంగా

రేపు ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం

నెల్లూరు(అర్బన్): వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ, నెల్లూరు ఆధ్వర్యంలో నిధి ఆప్కే నిఖత్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న అదానీ కృష్ణపట్నం పోర్టులో సమావేశం నిర్వహిస్తున్నామని అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్ల, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ముప్పవరపు సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల భవిష్యనిధి ఖాతా రక్షణ బీమా, ఖాతా వివరాలు, నామినేషన్‌పై అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

27న ప్రయోగశాల భవనం ప్రారంభం

నెల్లూరు(సెంట్రల్): స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయం సమీపంలో జీవన, సేంద్రియ ఎరువుల నాణ్యతా నిర్ధారణ ప్రయోగశాల భవనాన్ని ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు ఆ శాఖ జేడీ సుధాకర్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రయోగశాలలో వివిధ రకాల జీవన ఎరువుల నాణ్యతను పరిశీలించనున్నట్లు తెలిపారు.

'ప్రకాశం'లో మరో వివాదం

కందుకూరు: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో మరో వివాదం చోటుచేసుకుంది. కొందరు యువకులు, కాలేజీ సిబ్బందికి జరిగిన గొడవలో ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మంగళవారం కాలేజీలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన రసూల్, రహంతుల్లా, వినోద్‌కుమార్ అనే యువకులు వారి ఫ్రెండ్ ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతుండడంతో అక్కడికి వెళ్లారు. కాలేజీలోకి బైక్‌లతో వెళ్లిన యువకులు సైరన్స్‌తో హల్‌చల్ చేశారు. సిబ్బంది వారిని నిలువరించే ప్రయత్నం చేయగా ఇరువర్గాల మధ్య గొడవ చోటుచేసుకుని కొట్లాటకు దారితీసింది. కాలేజీ సిబ్బందిని యువకులు చితకబాదారు. ఇది గమనించిన కళాశాల యాజమాన్యానికి చెందిన వ్యక్తి కలుగజేసుకోగా ఆయనపై కూడా యువకులు దాడి చేశారు. ఇదంతా గమనించిన మిగిలిన కళాశాల సిబ్బంది యువకులను పట్టుకుని ఓ గదిలో పెట్టి తాళం వేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు వెళ్లి యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాలేజీ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిపై న్యూసెన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసినట్లు ఎస్సై శివనాంచారయ్య తెలిపారు.

ప్రగతి సాధనే విజయ సోపానం

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పలు పంచాయతీలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. ఆర్థికపరంగా, పరిశుభ్రత, ఫ్రెండ్లీ పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, తాగునీటి సరఫరా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. నెల్లూరులో సోమవారం ఆయా పంచాయతీల సర్పంచ్‌లు అవార్డులను అందుకున్నారు. ప్రగతి సాధనే తమ విజయసోపానమని ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. పంచాయతీల అభివృద్ధికి చేసిన కృషి, భవిష్యత్ ప్రణాళికలు వారి మాటల్లోనే.. – సాక్షి నెట్‌వర్క్



పొదలకూరు: నెల్లూరులో సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పులికల్లు సర్పంచ్ సుబ్బమ్మ

పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తా



నేను తొలిసారి రాజకీయాల్లోకి వచ్చాను. ప్రభుత్వం మహిళలను రాజకీయంగా ప్రోత్సహిస్తోంది. పాపంపల్లి పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తల కృషి ఎంతో ఉంది. చైల్డ్ ఫ్రెండ్లీ విభాగంలో పాపంపల్లి ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ప్రజల సహకారంతో ముందు పాపంపల్లి పంచాయతీని మరింత అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తా.

– కనసాని ఆదెమ్మ, పాపంపల్లి సర్పంచ్, దుత్తలూరు మండలం

బాధ్యత పెరిగింది



చాకలికొండ పంచాయతీకి ఉత్తమ అవార్డు రావడం ద్వారా మా బాధ్యత మరింత పెరిగింది. గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది సమష్టి కృషితో ఈ అవార్డు రావడం జరిగింది. గ్రామంలో పార్కు ఏర్పాటు చేయడం ద్వారా పిల్లలు, పెద్దలు శారీరక వ్యాయామం, విశ్రాంతి, ఉపశమనాన్ని పొందవచ్చు. భవిష్యత్‌లో విద్య, వైద్యపరంగా అభివృద్ధి సాధించాలనేది మా ప్రణాళిక.

– ఉప్పిరెడ్ల సుబ్బలక్ష్మీకుమారి, చాకలికొండ సర్పంచ్, వింజమూరు మండలం

రాష్ట్రస్థాయి పురస్కారం అందుకోవడమే లక్ష్యం

పులికల్లు పంచాయతీ జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ప్రధానంగా పంచాయతీలో పారిశుద్ధ్యం, వీధిదీపాలు, మంచినీటి సరఫరా, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై దృష్టి సారించడంతోపాటు నూరు శాతం మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశాం. వచ్చే ఏడాది జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నాటికి రాష్ట్రస్థాయి పురస్కారం అందుకోవడమే లక్ష్యంగా పంచాయతీలో సౌకర్యాలు మెరుగుపరిచేలా కృషి చేస్తాం.

– జీవీ సుబ్బమ్మ, పులికల్లు సర్పంచ్, పొదలకూరు మండలం

గ్రామపెద్దల సహకారంతోనే అభివృద్ధి



జాయతీ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా 'ఉమన్ ఫ్రెండ్లీ' విభాగంలో దువ్వూరువారిపాళెం పంచాయతీ జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. గ్రామపెద్దల సహకారంతో పంచాయతీలోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధిని సాధిస్తున్నాం. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో పంచాయతీకి అవసరమైన పనులు పూర్తి చేసే విషయంలో శ్రద్ధ చూపిస్తాను.

– అన్నాబత్తిన కృష్ణవేణి, దువ్వూరువారిపాళెం సర్పంచ్, ముత్తుకూరు మండలం

అందరి సహకారంతో అవార్డు



ఇనమడుగు పంచాయతీకి జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు రావడం ఎంతో గర్వకారణం. పంచాయతీలో ఎక్కడా పారిశుద్ధ్య లోపం లేకుండా చేసిన కృషికి ఈ అవార్డు లభించింది. పంచాయతీలోని ప్రతి ఒక్కరి సహకారంతోనే ఈ విజయం సాధ్యమైంది. అధికారులు, గ్రామపెద్దల సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

– దామెర్ల ప్రమీల, ఇనమడుగు సర్పంచ్, కోవూరు మండలం

నూతన ప్రణాళికలతో ముందుకెళ్తాం



మా పంచాయతీ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం సహకారం, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకుల చొరవ బాగా తోడ్పడింది. ప్రజల సహకారంతో పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తాం. నూతన ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం. నన్ను ప్రోత్సహిస్తున్న వరిగొండ ప్రజలకు మరింత సేవ చేసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తా.

– ఈగా సుబ్బరత్నమ్మ, వరిగొండ సర్పంచ్, తోటపల్లిగూడూరు మండలం

శకునాలపల్లిలో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లిలో వి.శేఖర్ నివాసంలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు శకునాలపల్లికి చెందిన శేఖర్ సీతారామపురం మండలం బసినేనిపల్లిలో ఉన్న తన షాపునకు రోజూలాగే వెళ్లాడు. శేఖర్ కుమార్తెలు ఇంట్లోని బీరువాలో ఉన్న దుస్తులు తీసుకునేందుకు తాళం తీసి వేయడం మరిచిపోయారు. మధ్యాహ్నం బీరువా తాళాలు అలాగే ఉంచి ఇంటికి తాళం వేసి అక్కడే పెట్టి కుటుంబసభ్యులంతా పొలం పనులకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చినా బీరువాను పరిశీలించలేదు. శేఖర్ మంగళవారం ఉదయం నగదు అవసరమై బీరువాను పరిశీలించగా లోపలి రెండు లాకర్లు ధ్వంసం చేసి ఉండడాన్ని గుర్తించాడు. అందులో ఉన్న రూ.60 వేల నగదు, సుమారు 12 సవర్ల బంగారు ఆభరణాలు లేకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ గిరిబాబు, ఎస్సై ప్రభాకర్ నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్‌టీంతో కలిసి గ్రామానికి చేరుకొని శేఖర్ నివాసాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

కొండాపురం: పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట మంగళవారం కొండాపురం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొమ్మి పంచాయతీ రామానుజపురం గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహం, అదే గ్రామానికి చెందిన మల్లిక గత ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వారు కావడంతో పెద్దలు వారి పెళ్లికి అంగీకరించని క్రమంలో మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయారు. కొండబిట్రగుంటలోని శ్రీప్రసన్న వెంకటేశ్వస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడినట్లు తెలిసింది.

ఖాతాదారులకు సంతృప్తికర సేవలు

- ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప సెవెన్‌రోడ్స్: ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడంలో తమ బ్యాంక్ ముందుంటుందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ రాకేష్‌కశ్యప్ తెలిపారు. 2022–23 మార్చితో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. గడిచిన సంవత్సర కాలంలో తమ బ్యాంక్ రూ.41,656 కోట్ల వ్యాపారంతో రూ.595.15 కోట్ల నికర లాభాన్ని సంపాదించిందని, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.2398.42 కోట్ల అదనపు వ్యాపారాన్ని నిర్వహించి 6.11శాతం వృద్ధిరేటు నమోదు చేసుకున్నామని తెలిపారు. సీఆర్ఏఆర్ చట్టబద్ధమైన లక్ష్యం 9.00 శాతానికి ధీటుగా 23.90 శాతం నమోదైందని తెలిపారు. తమ బ్యాంక్ రూ.3789.26 కోట్ల నికర విలువ కలిగి ఉందన్నారు. బ్యాంక్ ఖాతాదారులు మార్చి 31 నాటికి 57.73 లక్షల మంది కాగా, డిపాజిటర్లు 67.64 లక్షల మంది, రుణగ్రహీతలు 16.10 లక్షల మంది ఉన్నారని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యతా రంగాలకు అందించిన రుణాల స్థాయి రూ.19,923 కోట్లకు చేరిందన్నారు. వ్యవసాయరంగానికి ఇచ్చిన రుణాల స్థాయి రూ.16,899 కోట్లకు చేరిందని తెలిపారు.

ఈ ఏడాది లక్ష్యాలు

2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యాపార లక్ష్యాన్ని రూ.45,500 కోట్లుగా నిర్దేశించుకున్నామన్నారు. చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించడం, పీఎంజేడీవై ఖాతాల్లో లావాదేవీలు నిర్వహించేలా అవగాహన పెంపొందించడం, రికరింగ్ డిపాజిట్లు, రీటైల్ టర్మ్ డిపాజిట్లను విరివిగా ప్రారంభిస్తామని తెలిపారు. బ్యాంక్ జీఎంలు జగదీశ్వర్‌రావు, కె.విజయభాస్కర్, పీఆర్ పడగెటవార్, ఆర్.గిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై దృష్టి సారించాలి

- ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా మరమ్మతులకు గురవుతున్నాయని, వాటి నిర్వహణపై దృష్టి సారించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య విద్యుత్‌శాఖ అధికారులను హెచ్చరించారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి ఆయన మంగళవారం జిల్లాకు చెందిన విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అకౌంట్స్ ఆఫీసర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నుంచి వచ్చే ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లులు తీసే సమయంలో తప్పనిసరిగా ఐఆర్డీఏ ద్వారా బిల్లింగ్ చేయాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో ఉచిత విద్యుత్ సర్వీసులను వెంటనే ఇవ్వాలని, 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చిన విద్యుత్ సంబంధిత ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవసాయ సర్వీసులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే విద్యుత్ సిబ్బంది సేఫ్టీ కిట్స్ ధరించి, ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలను మంగళవారం నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. కనుపర్తిపాడు ఎస్సీకాలనీకి చెందిన సాదేపల్లి చిన్నయ్య(45),రాజమణి దంపతులు. వారికి ఇద్దరు కుమారులు. చిన్నయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానికంగా ఉండే ఓ మహిళతో ఆయనకు వివాహేతర సంబంధం ఉంది. మద్యం తాగినప్పుడల్లా ఆయన సదరు మహిళతోపాటు ఆమె సోదరుడు ఎస్.వెంకటరమణయ్య, వారి కుటుంబసభ్యులను అసభ్యకర పదజాలంతో దూషించేవాడు. దీంతో కోపోద్రిక్తులైన వెంకటరమణయ్య, అతని బంధువులు చిన్నయ్యను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 19వ తేదీన వెంకటరమణయ్య తన బంధువులైన ఎస్.శ్రీనివాసులు, ఎం.సురేంద్ర, ఎం.సుప్రియ, ఎం.నరసయ్య, బి.ప్రమీల, బి.శ్రీనివాసులుతో కలిసి ఓ పథకం ప్రకారం చిన్నయ్యతో గొడవ పెట్టుకున్నారు. చిన్నయ్య కళ్లలో కారం చల్లి బరిసె, గొడ్డలితో దాడి చేసి హత్య చేశారు. అనంతరం వారు అక్కడి నుంచి పరారయ్యారు. చిన్నయ్య భార్య ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి తన సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి గొలగమూడి క్రాస్‌రోడ్డు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ తనిఖీ కేంద్రం సమీపంలో నిందితులను అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన బరిసె, గొడ్డలిని స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎస్సైలు సీహెచ్ కోటిరెడ్డి, మస్తానయ్య, హెడ్‌కానిస్టేబుల్స్ ఎస్.ప్రసాద్, వేణుగోపాల్, గోవర్ధన్‌రావు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 123
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 136

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య



బావిలో మృతదేహాన్ని వెతుకుతున్న ఎస్సై శివనాంచారయ్య




లావణ్య మృతదేహం

కందుకూరు రూరల్: మనస్తాపంతో బావిలో దూకి బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని కొండికందుకూరు బుద్ధానగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన జి.ఆనంద్, యశోద దంపతుల మధ్య సోమవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో రెండో కుమార్తె అయిన లావణ్య(16) మనస్తాపం చెంది మంగళవారం ఉదయం బహిర్భూమికి అని వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం వెళ్లిన కుమార్తె ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు వెతుకుతుండగా బావిలో చెప్పులు తేలాడుతున్నాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బావిలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. లావణ్య పదో తరగతి పరీక్షలు రాసింది. ఇంటర్మీడియట్‌లో చేరేందుకు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష కూడా రాసింది.

అతికష్టం మీద బయటకు..

పాడుపడిన వ్యవసాయబావి, అందులో చిల్లచెట్లు, కంప పడి ఉండడంతో బావిలోకి దిగేందుకు కూడా వీల్లేకుండా ఉంది. కందుకూరు రూరల్ ఎస్సై శివనాంచారయ్య, సిబ్బంది బావిలోకి దిగి మృతదేహాన్ని గాలించారు. ఎస్సై నీళ్లలో మునిగి మృతదేహాన్ని వెతికి అతికష్టం మీద బయటకు తీశారు.

వైభవంగా శంకర జయంతి



ఉపనయనాలు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జగద్గురువు ఆది శంకరాచార్య జయంతి వేడుకలను మంగళవారం స్థానిక శివాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అర్చక, పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేళ్లచెరువు శివకుమార్ శర్మ నేతృత్వంలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆదిశంకరాచార్య చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేశారు. పలువురు బ్రాహ్మణ వటువులకు ఉపనయనాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు వాకాటి మురళీధరశర్మ, రామకృష్ణ, సంతోష్‌కుమార్, కిషోర్‌కుమార్, మహిళా సంఘం సభ్యులు అపర్ణ, ఉషారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుక్క పిల్లల అపహరణ

నెల్లూరు(క్రైమ్): పెట్‌స్టోర్‌లోని కుక్కపిల్లలు, నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించారు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరు రూరల్ మండలం ధనలక్ష్మీపురానికి చెందిన పి.నవీన్‌కుమార్ వీఆర్సీ టవర్‌క్లాక్ సమీపంలో చిన్ని పెట్‌స్టోర్ పేరిట పెంపుడు జంతువులు, వాటికి సంబంధించిన ఆహార విక్రయ కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 24వ తేదీ రాత్రి ఆయన షాపు మూసివేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సుమారు ఒకటిన్నర గంటల సమయంలో గుర్తుతెలియని ముగ్గురు దుండగులు మొదటి అంతస్తులో వెనుక డోర్‌ను తొలగించి లోనికి ప్రవేశించారు. రెండో అంతస్తు అరల్లో ఉన్న రూ.1.20 లక్షల విలువ చేసే మూడు కుక్క పిల్లలు, స్టోర్‌లో ఉన్న రూ.3,400 నగదును అపహరించుకుపోయారు. ఉదయం కుక్కల స్టాక్ రావడంతో నవీన్ స్టోర్‌కు వచ్చి కుక్కలను లోపల వదిలిపెట్టారు. రెండో అంతస్తులోని మూడు అరల్లో ఉన్న కుక్క పిల్లలు కనిపించలేదు. మొదటి అంతస్తులోని వెనుక డోర్ తెరిచి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించి బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సైదులు కేసు నమోదు చేశారు. స్టోర్‌లోని సీసీ ఫుటేజీల్లో చోరీ దృశ్యాలను గుర్తించి ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ఎస్సై విచారిస్తున్నారు.